## డెయిరీని విజయ పథాన నిలుపుతాం: లోక భూమారెడ్డి



కడెం : తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ డెయిరీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు విజయ డెయిరీ కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. ఆయన కడెం వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తాను ఛైర్మన్ అయ్యాక ముఖ్యమంత్రి సహకారంతో విజయ డెయిరీని అభివృద్ధిచేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్నెళ్లక్రితం రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల లీటర్ల పాలసేకరణ ఉంటే దాన్ని 5లక్షల లీటర్లకు పెంచామన్నారు. విజయ పాలను, 12 రకాల పాల ఉత్పత్తులను అన్ని ప్రాంతాల్లోని వారికి అందుబాటులోకి తెచ్చేలా చూస్తున్నామని, అందుకోసం విజయ పార్లర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిఉన్నవారు సంప్రదిస్తే విజయపార్లర్‌లను మంజూరి ఇస్తామన్నారు. పాడిరైతులకు మేలు కలిగేలా నాలుగు రూపాయల ఇన్సెంటివ్, రెండు రూపాయల పాలధరను పెంచడం జరిగిందన్నారు. 1967లో ఏర్పాటైన విజయ డెయిరీ కేంద్రానికి తోడు వంద ఎకరాల్లో మరో మెగా డైరీకేంద్రాన్ని రాజధానిలో ఏర్పాటుచేస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. లక్షెటిపేట కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని రూ. 1.5 కోట్లతో అక్కడ ఈప్రాంత రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదిలాబాద్‌లో రైతులకు మేలైన పాడి సంపదను అందించేందుకు దూడల పెంపకకేంద్రాన్ని ఈనెల 16న ప్రారంభిస్తామన్నారు. పాడిరైతులకు ఇటీవల గుజరాత్‌లో అమూల్ పాడి పరిశ్రమను చూపించామన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా రైతులకు ఉపాధినిచ్చేలా పాడి పరిశ్రమను పెంచుకునేలా ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. రాయితీపై గేదెలు, ఆవులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తెరాస రైతువిభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, తెరాస ఉమ్మడిజిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్ గౌడ్, బి. బాబన్న, మండల నాయకులు జీవన్ రెడ్డి, చక్రపాణి, కోల గంగన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## విద్యాపీఠాలు విద్యాప్రమాణాలను పెంచుతున్నాయి

మెదక్ : సరస్వతీ విద్యాపీఠాలు బాలసంస్కార్ కేంద్రాలను ప్రారంభించి విద్యాప్రమాణాలను పెంచేలా పనిచేస్తున్నాయని విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సేవాప్రముఖ్ కుందూరు విద్యాన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌చౌక్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించిన బాలసంస్కార్ కేంద్ర నిర్వాహకుల వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అవుతున్నా విద్యావ్యవస్థలో లోపాల వల్ల ఇంకా చదువులో వెనుకబడి ఉన్నామన్నారు. సరస్వతీ విద్యాభారతి ఆధ్వర్యంలో వెనుకబడిన ప్రాంతాల్లో బాలబాలికలకు సంస్కారంతో కూడిన నాణ్యమైన చదువు అందిస్తూ విద్యాప్రమాణాల్ని పెంచుతోందన్నారు. ఇందులోభాగంగా పట్టణంలో 15 బాలసంస్కార్ కేంద్రాలను స్థాపించామన్నారు. విద్యతో పాటు నైతికవిలువలు పెంపొందిస్తూ మంచి నడవడికను నేర్పించడం వల్ల వారిలో దేశభక్తి పెంపొంది దేశాభిమానులుగా తయారుచేస్తోందన్నారు. కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం జిల్లా కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది నిమ్మల ప్రతాప్‌రెడ్డి, విభాగ్ కార్యదర్శి హన్మంతరెడ్డి, జిల్లా సేవాప్రముఖ్ సామరమేష్‌రెడ్డి, పాఠశాల సేవా ప్రముఖ్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## కాలాన్ని అందిపుచ్చుకున్న వారికే అవకాశాలు

### యువతకు సూచించిన ఎన్ఆర్ఐ బృందం సభ్యుడు శ్రావణ్ తెడ్ల



పొట్‌పెల్లి : నేటి రోజులలో మనిషి జీవిత కాలం చాలా తగ్గింది.. అందుకే మన జీవిత కాలంలో సమయం చాలా విలువైనదిగా గుర్తించి దానిని ప్రణాళిక ప్రకారం అందిపుచ్చుకున్న వారు ఎలాంటి అవకాశాల కోసం వెంపర్లాడే అవసరం లేదని, వాటంతటవే దరిచేరుతాయని ఎన్ఆర్ఐ బృందం సభ్యుడు శ్రావణ్ తెడ్ల అన్నారు. మండలంలోని పొట్‌పెల్లి(బి) గ్రామాన్ని గ్రామ్ సపోర్టు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ బృందం సభ్యులు సందర్శించారు. గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎల్లన్న కుంటాల మండలం పెంచికల్‌పాడ్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు ఆంగ్ల మాధ్యమంలో సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించే పద్ధతులను సామాజిక మాధ్యమం ద్వారా తెలుసుకున్న ఎన్ఆర్ఐ బృందం సభ్యులు ఆయన పాఠశాలను సందర్శించడానికి వచ్చారు. తమ గ్రామాన్ని కూడా సందర్శించాలని ఎల్లన్న కోరడంతో వారు పొట్‌పెల్లి(బి)కి వచ్చారు. ఇక్కడ గేదె దూడల అభివృద్ధి కేంద్రాన్ని సందర్శించి, దీని వల్ల పొందే లాభాలను నిర్వాహకుడు అర్షి ముత్తన్నను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ నేటి సమాజంలో తమకు ఉపాధి దొరుకుతుందో లేదోననే అనుమానంతోనే యువత తమ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. సమాజం లో మన చుట్టూ ఎంతో మంది, ఎన్నో విషయాలు తెలిసిన వారుంటారు.. వారి నుంచి సలహాలు స్వీకరిస్తూ మీ సమయాన్ని అందుకు అనుగుణంగా వెచ్చిస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయన్నారు. సమాజంలో మనుషులున్నంత కాలం అవసరాలుంటాయని, అవసరాలున్నంత కాలం ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందన్నారు. కాని మనలో దాగి ఉన్న విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని ముందుగా మనమే గుర్తుంచుకుని దానికనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగితే మిమ్మల్ని మించిన వారు ఉండరని యువతలో ధైర్యాన్ని నింపారు. అందుకు మారుమూల గ్రామంలో పేద కుటుంబంలో పుట్టి తనంతట తానుగా ఈ రోజు ఇంతమంది ప్రశంసలు పొందే రీతిలో ఉపాధ్యాయ వృత్తిని చేపడుతున్న మీ గ్రామవాసి ఎల్లన్నను మీ గ్రామంలోని యువత అందరూ ఆదర్శంగా తీసుకుంటే చాలన్నారు. ఇతరులు సాయం చేస్తారేమోనని ఎదురుచూడకుండా ముందు మీలో ఉన్న శక్తిని నిరూపించుకునే ప్రయత్నం చేయాలన్నారు. యువతకు ఏ సమయంలో ఏ అవసరమొచ్చినా తాను అమెరికా నుంచి కూడా సూచనలిచ్చేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు తనవంతుగా సహాయ సహకారాలను అందిస్తూ, సర్కారు బడుల బలోపేతానికి కృషి చేస్తున్న కడారి నరేష్‌ను ప్రతి ఒక్కరు అభినందించారు.

ఈ సమావేశంలో సర్పంచి అంకం భూమన్న, బృందం సభ్యులు సునిత, మనోహన్, శాంతి పుట్టా, మాలిక్, ఉష, శ్రీవిద్య, సాయికిరణ్, సిద్దార్థ, ఉదయ్, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## నేరెళ్ల ఘటనపై విచారణ జరిపించాలి



ఎదులాపురం : కరీంనగం జిల్లా నేరెళ్ల ఘటనను తీవ్రంగా తమ సంఘం ఖండించటంతో పాటు దీనిపై సీబీసీఐడీ ద్వారా విచారణ జరిపించి దోషులను గుర్తించి వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని మాల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు ప్రహ్లాద్ స్థానిక పాత్రికేయ ప్రాంగణంలో మాట్లాడుతూ సంఘటనలో రాజకీయ పార్టీల ప్రమేయం ఉన్నట్లు తేలితే వాటిని ఎన్నికల్లో అనర్హులుగా ప్రకటించాలన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో కల్పించుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవటంతో పాటు బాధితునికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

లేనట్లయితే తమ సంఘం ధీటైన జవాబు చెప్పటానికకి సిద్ధంగా ఉంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో కొందరు చట్టం గురించి తెలియక మాదిక సోదరులను తప్పుతోవ పట్టించటం మానుకోవా లని సూచించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూరం భగవాండ్లు, ఉపాధ్యక్షుడు కొక్కుల రమేష్, పట్టణ గౌరవ అధ్యక్షుడు వూషన్న, నాయకులు భూమన్న, కాడె స్వామి, ఎస్.పొచ్చన్న, ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ఉద్యమించండి

ఖమ్మం : ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యావిధానాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని ఏఐఎస్ఫ్ రాష్ట్ర మాజీ నాయకులు, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. నగరంలోని ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 82వ వార్షికోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించిన బాగం మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన ఏఐఎస్ఎఫ్ అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలక పాత్ర పోషించిందని, నేటికీ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని తెలిపారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వవిద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కషాయీకరణకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడే సమయం ఆసన్నమైందని, అవినీతికి, ఉగ్రవాదానికి, మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా సేవ్‌ఇండియా, ఛేంజ్ ఇండియా నినాదంతో ఏఐఎస్ఎఫ్ ముందుకు సాగుతుందని, దీనికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు పోటు ప్రసాద్, జిల్లా కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్, అధ్యక్షుడు ఇటికల రామకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి నిరోధకులుగా ప్రతిపక్షాలు

గజ్వేల్ : సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకునేందుకు తెదేపా, కాంగ్రెస్ నాయకులు సర్వశక్తులు ఒడ్డుతూ.. అభివృద్ధి నిరోధకులుగా మారుతున్నారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నగర పంచాయతీ(జీపీఎన్పీ) ఛైర్మన్ గాడిపల్లి భాస్కర్ ధ్వజమెత్తారు. తెరాసవి ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మాదాసు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన గజ్వేల్‌లోని ప్రభుత్వ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ సాధించుకున్న విషయాన్ని ప్రతిపక్ష పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. ఎస్ఆర్ఎస్పీ ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం పునరుజ్జీవ కార్యక్రమాన్ని చేపడితే దానిపై కూడా విమర్శలు చేయటం అర్థరహితమన్నారు. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలసవెళ్లిన సింగూరు పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ఇప్పుడు ప్రాజెక్టులోకి నీరు రాగానే తిరిగి గ్రామాల్లోకి వచ్చి స్థిరపడుతున్నారని చెప్పారు. ప్రాజెక్టులు కట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదంటూ తెదేపా రాష్ట్ర నేత ప్రతాప్‌రెడ్డి రైతులను ఎగదోస్తున్నారని, ఆయన తీరు మానుకోవాలన్నారు. ప్రభుత్వాన్ని బదనాం చేస్తూ కోదండరాం చేపడుతున్న స్ఫూర్తియాత్రను రైతులే అడ్డుకుని వెనక్కు పంపిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధితో మరో పాతికేళ్లు తెరాస అధికారంలో కొనసాగటం ఖాయమన్నారు.

## గ్రామ హరిత సైనికులకు సైకిళ్లు

### 400 సైకిళ్ల కొనుగోలుకు పాలనాధికారి ఆదేశం

హుస్నాబాద్ గ్రామీణం: హరితహారం కార్యక్రమంలో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణకు ఎంపిక చేసిన గ్రామ హరిత సైనికులకు సైకిళ్లు ఇవ్వనున్నారు. మునుపెన్నడూ లేని విధంగా నాటిన ప్రతి మొక్కను బతికించాలనే ఉద్దేశంతో హరితహారం కార్యక్రమాన్ని సరికొత్త పంథాలో చేపడుతున్నారు. ఇప్పటికే అవెన్యూ ప్లాంటేషన్ విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొక్కలకు సేంద్రీయ ఎరువు అందించడంతో పాటు జంతువుల బారి నుంచి కాపాడేందుకు ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో 2 కి.మీ మేర రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని నిర్ణయించారు. వీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, నీరు పోయడంతో పాటు సంరక్షించేందుకు హరిత సైనికులను నియమించింది. ఒక కి.మీ పరిధిలో 400 మొక్కల చొప్పున జిల్లా వ్యాప్తంగా 800 నుంచి 1200 కి.మీ మేర మొక్కలు నాటాలనేది లక్ష్యం. ఇప్పటి వరకు రహదారులకు ఇరువైపులా జిల్లాలో 2,82,516 మొక్కలు నాటారు. వీటిని సంరక్షించేందుకు ప్రతి 400 మొక్కలకు ఒకరు చొప్పున హరిత సైనికులను నియమించారు. జిల్లావ్యాప్తంగా 539 మంది హరిత సైనికులను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. వీరికి మొక్కలు నాటడంతో పాటు సంరక్షణపై శిక్షణ కూడా ఇచ్చారు. హరిత సైనికులకు ఉపాధి హామీ కింద కూలీ డబ్బులు చెల్లించనున్నారు. అయితే నిరంతరం మొక్కలను పర్యవేక్షించేందుకు హరిత సైనికులకు సైకిళ్లతో పాటు జాకెట్ (యూనిఫాం), కిట్, బ్యాడ్జి ఇవ్వనున్నారు. ఇప్పటికే 400 సైకిళ్లను కొనుగోలు చేయాలని పాలనాధికారి వెంకటరామరెడ్డి ఈ నెల 11న గజ్వేల్‌లో జరిగిన సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్‌బాబును ఆదేశించారు. అనుకున్నట్లుగా ఎవరి స్థాయిలో వారు బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తే ఈసారి హరితహారం విజయవంతం అయ్యే అవకాశం ఉంది.

## భైంసా సందర్శించిన డీసీహెచ్

భైంసా : భైంసా ప్రాంతీయాసుపత్రిలో శిశువు మృతి, తదుపరి చోటుచేసుకున్న సంఘటనపై జిల్లా ప్రాంతీయాసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ సుధాకర్ భైంసా సందర్శించారు. తానూరు మండలం కోలూరు గ్రామానికి చెందిన గర్భిణి లలిత పురిటినొప్పులు రావడంగో భైంసా ప్రాంతీయాసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడి వైద్యులు శస్త్రచికిత్సచేసి శిశువును బయటకు తీశారు. శిశువు మరణించి ఉండటంతో బంధువులు ఆందోళనకు దిగారు. వైద్యులు, సిబ్బంది సకాలంలో స్పందింక పోవడంతోనే శిశువు మృతి చెందిందని ఆరోపించారు. అంతటితో ఆగని వారు శస్త్రచికిత్స చేసిన వైద్యుడిపై పట్టణపోలీసులకు ఫిర్యాదు చేశారు.

గర్భిణి లలితకు ముందస్తు పురిటినొప్పులు (తొమ్మిదో నెలల్లోనే) వచ్చాయని, ఆమెకు సాధారణ ప్రసవంకోసం ప్రయత్నించి చివరగా సకాలంలోనే శస్త్రచికిత్స చేశామన్నారు. నెలలు నిండని శిశువు మృతి చెందేందుకు వివిధ కారణాలు దోహదమవుతాయని, ఇందులో తమ తప్పేమి లేదని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పేర్కొన్నారు. పైగా ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య భారీగా పెరుగుతుందని, దానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది లేరని, ఉన్న కొంత మందిపైనే అధనపు భారం పడుతున్నా రోగుల సమస్యను అర్థం చేసుకుని సాధ్యమైనంత వరకు సేవలు అందిస్తున్నా ప్రజలు అర్థం చేసుకోవడం లేదంటున్నారు. దీనికి తోడు వైద్యం అందించిన వైద్యుడిపై పోలీసు కేసు సమంజసం కాదంటూ దానికి నిరసినసగా ఆసుపత్రి వైద్యులు మూకుమ్మడి సెలవు పెట్టారు. ఆసుపత్రి ఇతరత్రా సిబ్బంది సైతం వారికి సంఘీభావం ప్రకటించారు. విషయం తెలుసుకున్న జిల్లా ప్రాంతీయాసుపత్రుల సమన్వకర్త(డీసీహెచ్) డాక్టర్ సుధాకర్ వెంటనే భైంసా సందర్శించి సంఘటన పూర్వపరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ యు.కాశీనాథ్, వైద్యులతో సుదీర్ఘ మంతనాలు జరిపి వైద్యులకు నచ్చజెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గర్భిణి లలితకు ఇక్కడి వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో వైద్యం అందించారని పేర్కొన్నారు. నెలలు నిండని గర్భిణికి పురిటినొప్పులు వస్తే సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవ పద్ధతిలోనే శిశువును బయటకు వచ్చేలా చేయాలని, అందుకు 48గంటల వరకు పర్యవేక్షణలో ఉంచాల్సి ఉంటుందన్నారు. అత్యవసరమైతేనే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని, లలితకు అలాంటి పరిస్థితిలోనే శస్త్రచికిత్సచేసి శిశువును బయటకు తీశారని తెలిపారు.

ప్రాథమిక నివేదిక ఆధారంగా నెలలు నిండకపోవడంతోనే శిశువు మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు తమకు, పోలీసులకు ఫిర్యాదు మేరకు శిశువు ఎలా మృతి చెందిందనే విషయమై నిజామాబాద్ మెడికల్ కళాశాలలో మృతదేహాన్ని పరీక్ష కోసం పంపిచామన్నారు. నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు బాధితులు, వైద్యులు సంయమనం పాటించాలన్నారు. వైద్యులు సామూహిక సెలవు నిర్ణయాన్ని విరమించారని ఆసుపత్రిలే అన్నీ రకాల సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భైంసా ప్రాంతీయాసుపత్రి సందర్శనకు వచ్చిన డీసీహెచ్ డాక్టర్ సుధాకర్‌కు ఇక్కడి ఆసుపత్రిలో వైద్యులు విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదు చేశారు. రోగులు వస్తే చరవాణిల ద్వారా సమాచారం అందుకుని అప్పటికప్పుడు ఆసుపత్రికి చేరుకుంటారని ఆరోపించారు. దీంతో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతిస్పందించిన డీసీహెచ్ అలా జరగకుండా చూస్తామన్నారు. నిరంతరం ఓ వైద్యుడు విధుల్లో ఉండాలని, విధులపట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## 16న జీఎస్టీపై సదస్సు

ఖలీల్‌వాడి : ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జీఎస్టీ పై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ కన్వీనర్ రామ్మోహన్ రావు తెలిపారు. స్టడీ సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బుధవారం సాయంత్రం 5గంటలకు ప్రభుత్వ బాలికల ఐటీఐ సదస్సు ప్రారంభమవుతుందని, కార్యక్రమానికి రాజకీయ విశ్లేషకులు వీరయ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు కిషన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు తదితరులు హాజరు కానున్నారని చెప్పారు. జీఎస్టీ పన్ను విధానంపై సమగ్రంగా చర్చించడానికి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఉపాధ్యాయ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, మధ్యతరగతి ప్రజలందరు హాజరు కావాలన్నారు. సమావేశంలో ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ నాయకులు సత్యానంద్, శ్రీనివాస్‌రాజు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గోండి భాషను అధికారికంగా గుర్తింపునకు కృషి చేస్తా..

### కేంద్రమంత్రి సగన్ సింగ్ కులస్తే




ఇంద్రవెల్లి : వివిధ రాష్ట్రాల్లో గోండి భాష మాట్లాడే ఆదివాసులు ఉన్నారని, ఈ గోండి భాషను అధికారికంగా గుర్తించుటకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర మంత్రి సగన్ సింగ్ కులస్తే అన్నారు. దిల్లీలో గోండి భాష నిఘంటువు (డిక్షనరీ)ని రాజ్యసభ సభ్యుడు హరవింద్ నైతం, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, వివిధ రాష్ట్రాల ఆదివాసీ గోండు ప్రజా ప్రతినిధులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ.. తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆదివాసీ గోండి భాష మాట్లాడే వారు మూడు కోట్లకు పైగా ఉన్నారని, గోండి భాషను ఇతరులతో మాట్లాడినప్పుడే భాష అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఒక్కరు మాతృభాష అయిన గోండిని మరిచిపోకుండా మాట్లాడాలని సూచనలు చేశారు.

గోండి భాష ఇతరులకు అర్థమయ్యే విధంగా డిక్షనరీ ఇతర భాషలకు అనువాదం చేయడం అభినందనీయమన్నారు. డిక్షనరీ విడుదలకు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి అనక దేవేందర్, అర్క మానిక్‌రావు, కోట్నాక్ భీం రావు, వెడ్మ జైవంత్‌రావు, కొరెంగ జనార్ధన్, అర్క గోపాల్, కొరెంగ సీతారాం ప్రతినిధులు వెళ్లారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం : సీపీఐ



పాలమూరు : విద్యారంగ సమస్యల పరిష్కారంలో కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కందాళ రామకృష్ణ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఏఐఎస్ఎఫ్ 82వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు, నిరుద్యోగులు అలుపెరగని పోరాటాలు చేశారని, అయినా వారిని సీఎం కేసీఆర్ గుర్తించడం లేదన్నారు. అధికారం చేపట్టి మూడేళ్లు అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని చెప్పి అరకొర సౌకర్యాల మధ్యన గురుకులాలను ప్రారంభించారని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ పాలనలో విశ్వ విద్యాలయాల్లో మత రాజకీయాలను తీసుకు వస్తున్నారని ఆరోపించారు. విద్యా రంగాన్ని పూర్తిగా కాషాయికరణం చేయడానికి మోదీ పూనుకున్నారని తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము మాట్లాడుతూ కార్పొరేట్ విద్యను ప్రభుత్వం ప్రోత్సహించడం వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, నాయకులు సురేశ్, అంజి, బాలకిషన్, మధుగౌడ్, శ్రీకాంత్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రత్యేక శ్రద్ధ
## రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట : ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల మోజులో సర్వస్వం కోల్పోతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట మండలం ఇర్కోడు, చిన్నగుండవెల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం వైద్యరంగంపై ప్రత్యేక శ్రద్ధతో అధిక నిధులు ఖర్చు చేస్తోందన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. గ్రామాలు కలిసి ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. తొలుత మండలంలోని ఇర్కోడుకు వచ్చిన ఆయన గ్రామంలో 25 రెండు పడక గదుల ఇళ్లకు శంకుస్థాపన చేశారు. రజక, గౌడ, రెడ్డి సామాజిక భవనాల పనులు ప్రారంభించారు. ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతులు, ఆదర్శ పాఠశాలలో సోలార్ వేడి నీటి యంత్రం, గ్రామంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. రూ.23 లక్షలతో నిర్మించ తలపెట్టిన నమూనా పంచాయతీ భవనం, పీఏసీఎస్ దుకాణ సముదాయం, మార్కెట్ గోదామును ప్రారంభించారు. బ్యాటరీ సాయంతో నడిచే చెత్త సేకరణ ఆటో, గొల్లకుర్మల కోసం నిర్మించిన గొర్రెల పాకలు తదితరాలను ప్రారంభించారు. అంతకు ముందు గ్రామస్థులు మంత్రి హరీశ్‌రావుకు డప్పు చప్పుళ్లు, బాణసంచాతో ఘన స్వాగతం పలికారు. గొల్లకుర్మలు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఇర్కోడులో కల్యాణ మండపం, గ్రంథాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అనంతరం చిన్నగుండవెల్లిలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, నూతన గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్ర భవనాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ యాదయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వెంకటరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, విద్యుత్తు ఏఈ కరుణాకర్ బాబు, ఎంపీడీవో సమ్మిరెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీహరి, సర్పంచులు వినీత, కిషన్‌రెడ్డి నాయకులు రవీందర్, బాలకిషన్‌రావు, యాదగిరి, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## తితిదే ఆధ్వర్యంలో
# 14న కృష్ణాష్టమి మహోత్సవాలు

మహబూబ్‌నగర్ : తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ఈ నెల 14న శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు తితిదే జిల్లా సమన్వయకర్త ఉత్తరపల్లి రామాచారి వెల్లడించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14 ప్రాంతాల్లో గోపూజ, ఉట్ల వేడుక ఈ విశేష పూజలుంటాయన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో కొమ్ముగేరిలోని లక్ష్మీనర్సింహ్మాస్వామి దేవాలయం, తితిదే కల్యాణ మండప ప్రాంగణంలో కృష్ణాష్టమి విశేష పూజలుంటాయని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార మండలి అధ్యక్షుడు ఎత్తపు కేశవులు, బి.నాగన్న, సురేశ్ చందర్‌దూత్, లక్ష్మీనర్సింహ్మాస్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటనర్సిములు, గోపాల్, కె.రాజు, ఈశ్వర్, ఆంజనేయులు, చిన్న వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోదండరామ్ అరెస్టును నిరసిస్తూ ఆందోళన

కొత్తగూడెం: తెలంగాణ ఐకాస ఆధ్వర్యంలో కొత్తగూడెం బస్టాండు ప్రధాన కూడలిలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అమరులైన వారి ఆశయాల సాధన కోసం శాంతియుతంగా చేస్తున్న ప్రదర్శనను కామారెడ్డిలో యుద్ధ వాతావరణంగా సృష్టించిన తెరాస ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెఐకాస ఛైర్మన్ కోదండరామ్‌ను అరెస్టు చేసి, రైతుల ముసుగులో కొందరు తెరాస గూండాలు, పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఐకాస నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించడమే కాకుండా నిరంకుశ విధానాలను అవలంభిస్తూ కోదండరామ్‌ను అరెస్టు చేయడం హేయమైన చర్య అని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం కాలరాస్తూ ప్రభుత్వం కొనసాగిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో తెఐకాస జిల్లా ఛైర్మన్ మల్లెల రామనాథం, నాయకులు శివప్రసాద్, వల్లాల భరత్, సీపీఎం నాయకులు భూక్యా రమేశ్, జునమల నగేశ్, జలాల్, ప్రసాద్, టీపీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి చార్వాక, బసపా నాయకుడు కొండ జంపన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు ఉప్పుశెట్టి రాహుల్ పాల్గొన్నారు.

# మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్

ఇల్లెందు : మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్ల నిర్మాణాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మడత రమ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓడీఎఫ్‌లో ఇల్లెందు పురపాలకం జిల్లాలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు. పురపాలకంలో శతశాతం పూర్తయిన క్రమంలో పలు వార్డుల్లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. పట్టణంలో బస్తీవాసులు వార్డుల్లో ఇంకా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలనుకున్న వారు దరఖాస్తు చేసుకొన్నట్లయితే వారికి త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఓడీఎఫ్ సంబంధించి తనిఖీల నిమిత్తం త్వరలోనే దిల్లీ బృందం తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బాసశ్రీనివాస్, కౌన్సిలర్ రవినాయక్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, డీఈ బోజ్యానాయక్ పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి కృషి: తెరాసవి

మిట్టపల్లి : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తోందని తెరాస విద్యార్థి విభాగం జిల్లా సమన్వయకర్త మహేష్ అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థుల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం విరివిగా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యతో పాటు నాణ్యమైన భోజనం, వసతి కల్పించిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామ్మోహన్, బిక్షపతి, నాగరాజు, రమేష్, తదితరులు ఉన్నారు.

# ఎంజీఎంలో పేషెంట్ కేర్ సర్వీసు త్వరలో ప్రారంభం

హైదరాబాద్ : ఎంజీఎం ఆసుపత్రిలో త్వరలో పేషంట్ కేర్ సర్వీసులను ప్రారంభించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టింది. పొరుగు సేవల పద్ధతిలో అవసరమైన సిబ్బందిని నియమించుకుని ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం. దీనిలో భాగంగా ఎంజీఎం, ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సాంకేతిక సిబ్బంది, ఇతర ఉద్యోగుల నిర్వహణ బాధ్యతను ఏజిల్ అనే సంస్థకు అప్పగించడానికి కలెక్టర్ ఆమ్రపాలి అంగీకరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ రకాల పోస్టులకు నోటిఫికేషన్‌ను ఏజిల్ సంస్థ జారీచేసింది. ఈనెల 10వ తేదితో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగిసింది. దరఖాస్తు చేసిన వారికి ఎంజీఎంలోని అకడమిక్ సెల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. పేషెంట్ కేర్ ఉద్దేశం, జీత భత్యాలు, విధుల వివరాల్ని వారికి వెల్లడించారు. ఒప్పందాలకు అంగీకరించినవారి దరఖాస్తులను పరిశీలనకు స్వీకరించారు. మిగిలిన వారు వెనక్కి వెళ్లారు. 1:3 పద్ధతిలో అభ్యర్థులను ఎంపికచేసి జాబితాను కలెక్టర్‌కు పంపిస్తామని సంస్థ ప్రతినిధులు ఖాజా మొయినుద్దీన్ తెలిపారు. . కార్యక్రమంలో దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయం చారిత్రక అవసరం




ఖమ్మం : నేటి సమాజంలో సామాజిక న్యాయం చారిత్రక అవసరమని తెలంగాణ సామాజిక, ప్రజాసంఘాల ఐక్యవేదిక(టీ-మాస్ ఫోరం) జిల్లా కన్వీనర్ యర్రా శ్రీకాంత్ తెలిపారు. అందుకు టీమాస్ ఫోరం ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు నిర్వహిస్తామన్నారు. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీమాస్ ఫోరం అంటే అనేక సంఘాల వేదిక అని, దీనిలో టీమాస్ ఫోరం మేనిఫెస్టోకు లోబడే సంఘాలు పనిచేస్తాయని తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఈనెల చివరినాటికి అన్ని మండల కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో 28 కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈనెల 10న భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన టీమాస్ జిల్లా సదస్సు విజయవంతం అయిందని, ఈ సదస్సులో 191 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నాడు తెలంగాణ ఉద్యమంలో పోరాటాలు చేసిన వారికి నేడు స్వరాష్ట్ర ఫలాలు అందడం లేదని, నాడు ఉద్యమంలో లేనివారు నేడు పదవులు అనుభవిస్తున్నారన్నారు. నేడు తెలంగాణ లో ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నివర్గాలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు అధికారంలో, అభివృద్ధిలో భాగస్వామ్యం లభించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలకు వ్యతిరేకరంగా టీమాస్ పోరాటాలు నిర్వహిస్తుందని ఉద్ఘాటించారు. టీమాస్ ఫోరంను గ్రామస్థాయిలో బలోపేతం చేసి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. ఈ సందర్భంగా టీమాస్ ఫోరం జిల్లా నూతన ఛైర్మన్‌గా రచయిత్రి జ్వలిత, కన్వీనర్‌గా యర్రా శ్రీకాంత్ ఎన్నికైనట్లు ప్రకటించారు. విలేకరుల సమావేశంలో ఫోరం జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు కూరపాటి వెంకటేశ్వర్లు, లింగాల రవికుమార్, మనోహర్, రాఘవులు, వీరభద్రం, కృష్ణారావు, మల్సూర్, వెంకన్న, గౌస్, ఉపేందర్, వీరభద్రం, భాస్కర్, ప్రసాద్, భారతి తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాల పునాదుల మీద భోగాలు అనుభవిస్తున్నారు
## టీ–మాస్ ఫోరం ప్రధాన ఉపన్యాసకులు ప్రభంజనయాదవ్

మహబూబ్‌నగర్ : ప్రజాస్వామ్య, కనీస హక్కులు కాలరాస్తున్నారు.. నిజాం పాలన మరిపెంచే విధంగా నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారు.. రాష్ట్రం ఏర్పడ్డాక కూడా 3 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డా పట్టింపు లేకుండా త్యాగాల పునాదుల మీద బోగాలు అనుభవిస్తున్నారని ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆచార్యులు ప్రభంజనయాదవ్ అన్నారు. జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక (టీ-మాస్) జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని 114 ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభంజనయాదవ్ మాట్లాడుతూ నీళ్లు, నియామకాలు, నిధులు అనే నినాదం ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. మిషన్ భగీరథతో ఆంధ్రా గుత్తేదారులు లాభం పొందుతుంటే.. మిషన్ కాకతీయ అధికార పార్టీ అనుయాయుల పరం అయిందన్నారు. అసెంబ్లీలో వర్గాల పరంగా ప్రాతినిధ్యం లేకపోవడంతో అగ్రవర్ణాలే ఎక్కువగా ఉండి సామాజిక న్యాయం, సమగ్రామాభివృద్ధి జరగడం లేదన్నారు. ప్రజల పక్షాల మాట్లాడే గొంతుకలపై కేసీఆర్ విరుచుపడుతున్నారని.. ఆలస్యమైనా ఫరవా లేదు.. అవసరాన్ని ఇప్పటికైనా గుర్తించాలని ప్రజా సంఘాలన్నీ సమష్టి శక్తిగా మారాలన్నారు. జిల్లా, మండల, పట్టణ, గ్రామ కమిటీలు ఏర్పడాలని, ఈ కమిటీలకు రాజకీయ తరగతులు నిర్వహించి ప్రజలను, చైతన్యవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లె గోపాల్ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వం కనీసం నిరసన తెలిపే అవకాశం కూడా లేకుండా చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు దారి మళ్లిస్తున్నారన్నారు. బీసీ బడ్జెట్ కేటాయించినా నేటికీ మంజూరు కాలేదన్నారు. ఎంబీసీ పేరిట రూ. వెయ్యి కోట్లు ఖర్చుచేస్తామని చెబుతున్నా.. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని, అసలు ఖర్చు ఎట్లా చేస్తారో కూడా చెప్పడం లేదన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మీసాల కుర్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వివిధ సామాజిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. టీ-మాస్ ఫోరం తయారు చేసిన విధాన పత్రానికి కొన్ని అంశాలను చేర్చుతూ సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం జిల్లా కమిటీ ఛైర్మన్ జలజం సత్యనారాయణ, కన్వీనర్ వి.కురుమూర్తి, టీ-మాస్ ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు దాసురాంనాయక్, న్యాయవాది వినోద్‌కుమార్, పీఆర్ఎస్ఎస్ జిల్లా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను గురుకులాలు మార్చాలి
## – యూటీఎం




మణుగూరు : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను గురుకులాలుగా మార్చి విద్యార్థు లకు నాణ్యమైన విద్యనందించాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మణుగూరులో ఏర్పాటు చేసిన టీఎస్‌యూటీ ఎఫ్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగ డుతూ గత 17 ఏళ్లుగా తమ సంఘం ఎన్నో ఉద్యమాలను నిర్వహించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి 10 శాతం బడ్జెట్ కేటాయిస్తామని ప్రకటించిగా.. గత మూడేళ్లలో ఈ శాతం 3.7 మించలేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిధుల్లోనూ కోతలు విధిస్తున్నారు. కంపూట్యరు విద్యపైనా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇందుకోసం ఎలాంటి నిధులను కేటాయించడం లేదన్నారు. ఆంగ్ల విద్యను వెనక్కినెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రవి విమర్శించారు. చరిత్ర, ఇతర అంశాల్లో పాఠ్యాంశాలను మార్చడం అంటే లౌకిక వాదానికి తూట్లు పొడవడమేనన్నారు. కొత్తగా తెరపైకి వచ్చిన డిటెన్షన్ విధానం వల్ల బడుగుల పిల్లలకు విద్య దూరం అవుతుంద న్నారు. భాజపా అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాహక్కు చట్టం వూసే ఎత్తడం లేదన్నారు. ఈ అంశాలపై వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తం గా ప్రచారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 28 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడులను ఆశ్రయిస్తున్నారని.. కనీసం వీరికైనా నాణ్యమైన విద్యనందించాల్సిన బాధ్యత ఉంద న్నారు. కానీ ప్రభుత్వం గురుకులాల పేరుతో నాణ్యమైన విద్యను అందిస్తామన్న భ్రమను ప్రజల్లో కలిగిస్తుందన్నారు. గురుకులాల్లో మొత్తం కలిపి 4 లక్షల మంది చదువుకునే అవ కాశమే ఉందని గుర్తుచేశారు. రాష్ట్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ గురుకులా లుగా, ఉప గురుకులాలుగా మార్చాలని రవి డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో 17వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా.. నేటికీ ఎలాంటి నియామకాలు నిర్వహించకుండా డీఎస్సీని వాయిదా వేస్తూ వస్తుందన్నారు. ఈ సంవత్సరం ఒక్క ఆంగ్ల పాఠశాలకు కూడా అనుమతి ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి కూడా ఏకీకృత సర్వీసు నిబంధనలు ప్రభుత్వం వద్ద వివాదాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చాయి కాబట్టి ఏకీకృత సర్వీసు నిబంధనలు అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాందాసు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, కార్యదర్శులు వీరస్వామి, బాలు, ఆడిట్ కమిటీ సభ్యుడు నంద తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయ తోటలో
## గంజాయి మొక్క అంతరపంటగా సాగు



మెదక్ : మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నప్పటికి పలుచోట్ల మత్తుపదార్థాలు ఇంకా లభ్యమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో మత్తుపదార్థాల తయారీని రూపుమాపాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఇటీవలి కాలంలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో పెద్దఎత్తున గంజాయి పట్టుకున్నారు. ఎలాంటి అనుమానం రాకుండా కూరగాయల తోటలో అంతరపంటలో గంజాయి సాగు చేస్తుండడం గమనార్హం. అధికారులకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి గుట్టును రట్టు చేశారు. ఓవైపు జిల్లాలో గుడుంబా తయారీ అరికట్టి తయారీదారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. గతంలోనే ఉమ్మడి మెదక్ జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా ప్రకటించారు. ఇలాంటి సమయంలో గంజాయిని సాగు చేస్తున్న విషయం ఆందోళన కలిగిస్తోంది. నారాయణ్‌ఖేడ్, మనూర్ మండలాల్లో గంజాయిసాగు చేస్తున్నప్పటికి మెదక్ పట్టణ కేంద్రంగా ఏర్పడిన కొత్త జిల్లాలో గంజాయి పట్టుబడడం మొదటిసారి. ఇటీవలి కాలంలో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి వరుసగా ముగ్గురిని అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఈ నెల 7న రామాయంపేట మండలం లక్ష్మాపూర్‌లో సిద్దయ్య అనే రైతు పొలంలో 450 గ్రాముల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద 170 గ్రాముల విత్తనాలు, 440 మొక్కలు దొరకడం విశేషం. 9న హవేలీఘణపూర్ మండలం గంగాపూర్ తండాలో ముడావత్‌పెంట్యా పొలంలో 22 మొక్కలు, తాజాగా హవేలీఘణపూర్ మండలం బ్యాతోల్‌లో సిద్దయ్య పొలంలో 100 మొక్కలను ధ్వంసం చేశారు. అతని వద్ద నుంచి 18 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మూడు ఘటనల్లో నిందితులు తమ వ్యవసాయ పొలాల్లో కూరగాయలతోపాటు అంతర్‌పంటగా గంజాయిని సాగు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ఇరక్‌పల్లిమోఘానాయక్ తండాలో ఐదువేల మొక్కలను గుర్తించారు. మునిపల్లి మండలం అంతారం వద్ద గతనెల 21న పెద్దఎత్తున గంజాయిని పట్టుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహ్మద్‌సలీం హత్నూర మండలంలోని పారిశ్రామికవాడలో కార్మికులకు గంజాయి విక్రయిస్తుండగా గత నెల 14న పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ విధంగా గంజాయిని సాగు చేస్తూ అధికారులకు పట్టుబడుతున్నా జైలుకు వెళ్లి బయటకు వచ్చాక తిరిగి ఇదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మహ్మద్‌సలీం గతంలో పలుసార్లు పట్టుబడినా వ్యాపారాన్ని మాత్రం వదలడం లేదు.

జిల్లాలో గంజాయి సాగు విషయమై జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిని ప్రశ్నించగా ఇటీవల పట్టుబడిన గంజాయికి సంబంధించి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 200 నుంచి 400 పైగా మొక్కలు పట్టుబడ్డాయని, వీరు సరఫరా చేసేవారు కాదన్నారు. అంటే అక్రమార్కులు రైతులకు ఆశ చూపి గంజాయి ఉచ్చులో బిగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. గంజాయి సాగు అనంతరం ఎండిన దశకు చేరుకోగానే కిలో రూ. 2 వేల వరకు పలుకుతోంది. పెద్దఎత్తున డబ్బులు వస్తుండడంతో పలువురు సాగుకు వెనకాడడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో గుడుంబా మాదిరిగా గంజాయిని రూపుమాపేందుకు ఎక్సైజ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడే మత్తు చెర వీడుతుంది.

